క్లుప్తంగా

5న ఢిల్లీలో మహిళల నిరసన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అక్టోబర్ 5వ తేదీన న్యూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళల హక్కులు, సమస్యల గురించి నిర్వహించే సభను విజయవంతం చేయాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ,ఆర్ఎస్ఎస్ హటావో..నారీ బచావో నారీ బచావో అనే నినాదం ఢిల్లీ వీధుల్లో మార్మోగాలని ఐద్వా ప్రతినిధులు ఆర్.లక్ష్మి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్వతి, కాసులమ్మ,సత్యవతి,కుమారి, విగ్నేశ్వరి పాల్గొన్నారు.

హడలెత్తించిన ఎండ

రాంబిల్లి : మండలంలో గురువారం ఎండ దెబ్బకు జనం విలవిలలాడారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా వ్యవసాయ పనుల్లో వున్న రైతులు మరింత ఇబ్బందులు పడ్డారు. పది రోజులుగా వర్షం పడలేదు. వర్షాలు పడకుండా ఎండ కొనసాగితే వరి పైరును తెగుళ్లు ఆశించే అవకాశాలుంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

30న కొక్కిరాపల్లి పీఏసీఎస్ మహాజన సభ

యలమంచిలి : ఈనెల 30వ తేదీన యలమంచిలి పట్టణం కొక్కిరాపల్లి పీఏసీఎస్ మహాజన సభ సమావేశం జరుగుతుందని అధ్యక్షుడు మళ్ల కొండబాబు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి సంఘ సభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో గతంలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీర్మానాలు ఆమోదించడంపై 2022–23 సంవత్సరంకు సంబంధించి అంతిమ ఆడిట్ నివేదిక అమోదించుటకు, జమా ఖర్చులు, ఆమోదించుటపై చర్చించనున్నారని తెలిపారు.

బీజేపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ముత్యాల అప్పారావు

అచ్యుతాపురం(అనకాపల్లి): భారతీయ జనతా పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యాల అప్పారావు అన్నారు. అచ్యుతాపురం బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, కూండ్రపు బాపు నాయుడు బాబు, మేరుగు కాసుబాబు,ఎండపల్లి రాజు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో మరిడిమాంబ



అనకాపల్లిటౌన్: గవరపాలెం శ్రీ మరిడిమాంబ అమ్మవారి దేవాలయంలో నెల పండగ పురస్కరించుకుని గురువారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బుద్ధ కృష్ణారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ వైస్ చైర్మన్ కె.ఎం.నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు, సభ్యులు బొడ్డేడ లక్ష్మీనరసింహం, కర్రి సూరిబాబు, పీలా నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్ఆర్ పేట రామాలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి సూరం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. వ్రతాలు చేయించుకునే భక్తులు ముందుగా ఆలయం వద్ద ఉచితంగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వ్రతం అనంతరం స్వామివారి ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వీసం రామకృష్ణ



నక్కపల్లిలో ఆకర్షణగా నిలిచిన ర్యాలీ

నక్కపల్లిలో ముస్లింల ర్యాలీ

నక్కపల్లి : మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీని గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నక్కపల్లి మండలం పెదబోదిగళ్లం, చినబోదిగళ్ల, పాయకరావుపేట, రామకృష్ణపురం, పెదదొడ్డిగల్లు గ్రామాలకు చెందిన ముస్లింలంతా ఆయా గ్రామాల నుంచి నక్కపల్లి వరకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. మండలంలో ఐదు గ్రామాల్లో ముస్లింలు, హిందువులు పూర్వ కాలం నుంచి అన్నదమ్ముల్లా కలసిమెలిసి జీవిస్తున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు జెండాలు బైక్‌లకు, వ్యాన్‌లకు కట్టి నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మైనార్టీల విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్బైస్, ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీటీసీ గొర్లె గోవిందు, ముస్లిం పెద్దలు అలీ, బాషా, జిలానీ, స్థానిక నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలో మిలాద్ ఉన్ నబీ ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ముస్లిం కాలనీలోని మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీ వేడుకగా జరుపుకొంటారు.

భారీ ర్యాలీ

ఎస్.రాయవరం : మండలంలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. చెల్లాపురం , సీతారాంపురం ముస్లింలు ర్యాలీలో పాల్గొన్నారు. చెల్లాపురం,అడ్డురోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు.

యలమంచిలి : యలమంచిలి జామియా మసీద్ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యలమంచిలి పాత జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖాసీం, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. రేగుపాలెం మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



యలమంచిలిలో శాంతి ర్యాలీ

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు

పాయకరావుపేట : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను బుధవారం గురువారం నిమజ్జనం చేశారు. గణేష్ నవరాత్రులు సందర్భంగా 9 రోజుల పాటు వినాయకుని పూజలు చేసి 9 వ రోజున ఘనంగా ఊరేగించి నిమజ్జనాలు చేశారు. నిమజ్జన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు, యువకులు పాల్గొని ఉత్సాహంగా డాన్సులు వేస్తూ గణపతి నిమజ్జనం చేశారు. అనంతరం ఆయా గణేష్ మండపాల వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వీధుల్లో వినాయకుడిని ఊరేగించారు. కోలాటాలు, మంగళ వాయిద్యాలు , భక్తుల నృత్యాల నడుమ గణనాథుడు ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.



గణేష్ నిమజ్జనం కోసం ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గణనాథునికి దీపారాధన



దీపారాధనలో భక్తులు

అనకాపల్లిటౌన్: మండలంలోని గుండాలవీధిలో బెస్ట్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణపతి చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారి మండపం వద్ద గురువారం సాయినగర్ భక్తులు దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాలమరశెట్టి కృష్ణ, రాంబాబు, వెంకటేష్, రమణబాబు, రాజు, లీల పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మేలు

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. అరబుపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. ఈ నెల 30 నుంచి సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అరబుపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఘనంగా దుర్గమాంబ పుట్టుక మహోత్సవం



పల్లకిలో దుర్గమాంబ అమ్మవారి ఊరేగింపు



దుర్గమాంబ సన్నిధిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బుల్లిబాబు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో వెలసిన దుర్గమాంబ అమ్మవారి పుట్టుక మహోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి గరగలను అందంగా పూలతో అలంకరించిన పల్లకిలో డప్పులు, వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. స్థానిక కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వెనుక ఉన్న దుర్గమాంబ పుట్ట వద్దకు తీసుకెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఊరేగింపుగా వచ్చిన ప్రజలు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతి రూపాన్ని పల్లకిలో చేర్చి, గ్రామంలో ఊరేగించారు. మహిళల కోలాటాలు, తోడపెద్దు సేవలు, భజనలు, నృత్యాలతో రాత్రి గ్రామం అంతటా తిప్పారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ అధ్యక్షుడు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.

కోలాటం బృందానికి చీరల పంపిణీ

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామంలో కోలాట బృందానికి గురువారం చీరలు పంపిణీ చేశారు. సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మహిళలు తమ పిల్లలకు కోలాటాలు నేర్పించడం అభినందనీయమన్నారు. శ్రీనివాసరావును స్థానిక పెద్దలు శాలువాతో సత్కరించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కైట్స్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో విద్యార్థులను కళాశాల యాజమాన్యం గురువారం అభినందించింది. కర్నూల్ జిల్లాలో అక్టోబర్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో కళాశాలకు చెందిన మణికంఠ సాయి, పి.తరుణ్, ఎం.సురేంద్ర, ఎస్.సుగుణ, వి.నూకరత్నంలు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అప్పలనాయుడు, డైరెక్టర్ ఆర్.గణేశ్, ఎ.శంకర్‌రావు, ఎ.సన్యాసిరావు, వి.ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు, పీఈటీ సన్యాసిరావు ఉన్నారు.



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కశింకోట.. అభివృద్ధి బాట



గవరపేట పెద్దగుమ్మం వీధిలో నిర్మించిన ప్రధాన రోడ్డు



చిన్న వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

- నాలుగున్నరేళ్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి
- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో ముందంజ

కశింకోట: స్థానిక కశింకోట పంచాయతీ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించి అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాన వీధులే కాకుండా, చిన్న చిన్న వీధు(సందు)ల్ని కూడా సిమెంట్ రోడ్లుగా మార్చారు. వీటిని మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఇంకా పలుచోట్ల రోడ్లు, కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మంత్రి కృషితో నిధుల మంజూరు

కశింకోట పంచాయతీ పరిధిలో సుమారు 20 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. అనకాపల్లి నియోజక వర్గంలోని మేజర్ పంచాయతీల్లో ఇది ఒకటి. ఇక్కడ నాలుగు సచివాలయాలున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచీ కశింకోట అభివృద్ధికి అమర్‌నాథ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు రప్పించడంతోపాటు, జెడ్పీ, గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులు మంజూరు చేయించారు. ఎంపీ బీవీ సత్యవతి కూడా ఎంపీ నిధులు కేటాయించి, అభివృద్ధికి తోడ్పడ్డారు. దీంతో ప్రధాన వీధులతోపాటు చిన్న వీధుల్లో కూడా సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించి అభివృద్ధి చేస్తున్నారు.

అభివృద్ధి బాటలు

గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లకు పైబడి నిధులు వెచ్చించి సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. కస్పావీధి, కుమ్మరి వీధి, గాడి వీధి, గవరపేట, కనకమహాలక్ష్మి వీధి, హౌసింగ్ కాలనీ, పూసర్ల వీధి, అఫీషియల్ కాలనీ, రౌతు వీధి, గోలి వీధి, మేదర వీధి తదితర ప్రాంతాలు సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయి. తాజాగా రూ.80 లక్షల విలువైన సిమెంట్ రోడ్లు, కాలువలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఎంపీ నిధులతో హౌసింగ్ కాలనీకి జాతీయ రహదారి నుంచి సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇంకా పలుచోట్ల సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిడుగుపాటుకు దూడ మృతి



దగ్ధమైన పాక, మృతి చెందిన దూడ

కోటవురట్ల: పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధమవ్వడమే కాకుండా దూడ ప్రాణాలు కోల్పోయింది. గురువారం సాయంత్రం మారిన వాతావరణంతో పిడుగులు బీభత్సం సృష్టించాయి. పిడుగు పడి రాజుపేట గ్రామానికి చెందిన పెంటకోట సత్తిబాబు పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. ఒక ఆవుపెయ్య మృతి చెందగా, ఆవు 70 శాతం పైగా కాలిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉంది. రైతుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది వచ్చేసరికే పాక మొత్తం కాలిపోయింది. సిబ్బంది మిగిలిన మంటలను అదుపు చేశారు. పాకలో పశుదాణా, డ్రమ్ము, ఇతర పరికరాలు కాలిబూడిదయ్యాయి. రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు సత్తిబాబు వేడుకుంటున్నాడు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

మునగపాక : ఈ నెల 30న మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. గురువారం సంబంధిత శిబిరాన్ని ఆయన పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు భరోసాగా నిలుస్తుందన్నారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను జనరేట్ చేసి ఇప్పటికే టోకెన్లు అందించారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు పాల్గొన్నారు.



మునగపాకలో ఆరోగ్య సురక్ష శిబిర కేంద్రాన్ని పరిశీలిస్తున్న అచ్చియ్యనాయుడు

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విప్లవం వర్థిల్లాలని తొలిసారిగా ఉద్యమానికి కొత్త నినాదం ఇచ్చిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాసరి అప్పారావు, పార్టీ నేతలు చిన్నారావు, రవీంద్రరాజు, గుంట్ల అప్పారావు,నరాలశెట్టి సూర్యనారాయణ, అప్పలనాయుడు,వేగి కృష్ణ, బుజ్జిబాబు,దొడ్డి చిన్న, దుర్గనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయదుంధుబి మోగించేలా కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి ఎం.ఎం.నాయుడు కోరారు. పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బీజేపీ మండల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ బూత్ కమిటీలు చురుగ్గా పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నేతలు దొడ్డి వెంకట సత్యనారాయణ, రామజోగినాయుడు, శాంతకుమార్, భార్గవాచార్యులు, లికేష్, కాలేశ్వరరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశమైన బీజేపీ నేతలు

జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు

మునగపాక : జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు. తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు రూ.90 లక్షలు మంజూరు కావడంతో గురువారం భూమిపూజ నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు శుద్ధి చేసిన నీరు అందుతుందన్నారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, బాలాజీ, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, కన్వీనర్లు గంగాజీ, జగదీష్ బాబు, ఉప సర్పంచ్ లక్ష్మీ త్రినాథ్, వెంకటరావు పాల్గొన్నారు.



తోటాడలో జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగవేణి

ఘనంగా దుర్గాలమ్మ తల్లి పండగ

మునగపాక : మునగపాకలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా నిర్వహించారు. మునగపాక పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి తరలి వచ్చారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాంబిల్లి: మూలజంప గ్రామంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



దుర్గాలమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

కశింకోట: స్థానిక సెంటినరీ బాప్టిస్టు చర్చి 119వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 500 మంది రోగులకు సేవలందించారు. సత్యదేవ్ ఆస్పత్రి అధినేత, వైద్యుడు బొడ్డేడ లక్ష్మీనరసింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు సురేష్‌కుమార్, బొడ్డేడ ప్రియాంక, ఆళ్ల వసంతకుమార్, యేసు ప్రసాద్ రోగులను పరీక్షించి మందులు అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

అనకాపల్లిటౌన్: ప్రధాని మోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ నేతలు మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 150 మంది రోగులు హాజరుకాగా, శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.వి.సత్యనారాయణ, అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.